# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, కార్యక్రమాల నిర్వహణపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సమీక్ష నిర్వహించారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు తిరిగి ప్రారంభమయ్యాయి.
- ❖ రాష్ట్రంలో తీర ప్రాంత సముద్ర ఆధారిత పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
- ❖ ఎమ్మెల్యే కోటా శాసనమండలి సభ్యుల ఎన్నికల నామినేషన్ గడువు ఈ రోజుతో ముగింసింది.
- ❖ సారా నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించింది.

==============================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు కార్యక్రమాల నిర్వహణపై ఆయా శాఖల మంత్రులు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ పథకాల అమలులో లబ్దిదారుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా అధికారులతో సమీక్ష జరిపారు. ప్రభుత్వ సేవల్లో నాణ్యత పెంచడం, ప్రజలు సంతృప్తి చెందేలా కార్యక్రమాలు అమలు చేయడం ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఫిర్యాదులు వస్తున్న విభాగాల్లో బాధ్యులను గుర్తించి మార్పు వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతి విషయంలో ఏమాత్రం సహించవద్దని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

==============================

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల్లో బాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ఈరోజు శాసనసభలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కేవలం రైతు భరోసా కింద సంవత్సరానికి 7,500 రూపాయలు ఇచ్చి మిగిలిన కార్యక్రమాలను ఆపేసిందన్నారు. సాయిల్ టెస్టింగ్, మెకనైజేషన్, ఇన్పుట్ సబ్సిడీ, 90 శాతం రాయితీతో ఇచ్చే డ్రిప్ పరికరాల పంపిణీ లాంటి కార్యక్రమాలను విస్మరించిందన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హత కలిగిన ప్రతి రైతుకి సంవత్సరానికి 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తామని అచ్చన్నాయుడు వెల్లడిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

==============================

రాష్ట్రంలో తీర ప్రాంత సముద్ర ఆధారిత పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ రోజు అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం అందుకు అవసరమైన వనరులను గుర్తించిందని స్పష్టం చేశారు. బీచ్ లు, క్రూజింగ్ బోటింగ్, ఫిషింగ్, సర్ఫింగ్, పాడిల్ బోర్డింగ్, వాటర్ అడ్వెంచర్ స్పోర్ట్స్ అభివృద్ధిపై దృష్టి సారించిందని తెలిపారు. టూరిజం పాలసీ 2024-29కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాధాన్యతను ఇస్తున్నారని పేర్కొన్నారు. వెల్ నెస్ టూరిజం డెవలప్ మెంట్ ను అభివృద్ధి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

==============================

రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా తెలుగు దేశం పార్టీ అభ్యర్థులుగా బీటీ నాయుడు, బీద రవిచంద్ర యాదవ్, కావలి గ్రీష్మ ఈరోజు నామినేషన్లు దాఖలు చేశారు. అసెంబ్లీ ఆవరణలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అదే విధంగా భారతీయ జనతా పార్టీ నుండి సోము వీర్రాజు కూడా ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు. ఇటీవల ఖాళీ అయిన 5 శాసనమండలి స్థానాలకు గానూ తెలుగుదేశం నుండి ముగ్గురు జనసేన, భారతీయ జనతా పార్టీల నుండి ఒక్కొక్కరు చొప్పున ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీలో నిలిచారు. కాగా ఈ రోజులో నామినేషన్ల ఖదలు చేసేందుకు గడువు ముగిసింది.

==============================

పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఈ రోజు అమరావతిలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఉపాధ్యాయుల సమస్యలను ఓ క్రమపద్ధతిలో పరిష్కరించామని వ్యాఖ్యానించారు. అంగన్వాడీలకు సంబంధించిన 4 సమస్యలు పరిష్కరించామని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఓ క్రమపద్ధతిలో ఒక్కొక్కటిగా తెస్తున్నామని మంత్రి వ్యాఖ్యానించారు.

విరామం

==============================

రాష్ట్రంలో సారా నిర్మూలనకు ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. ప్రజల నుండి ఫిర్యాదుల స్వీకరణకు ముందు సారా నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిల్లాలో నాటు సారా అరికట్టేందుకు సంబంధిత శాఖ అధికారుల సమన్వయంతో కలసి పని చేయాలని సూచించారు. 19 గ్రామాల్లో నాటుసారా తయారీ కేంద్రాలను గుర్తించాలని అన్నారు. ఈ ప్రాంతాల నుండి అక్రమ సారా తయారు చేసే వ్యక్తుల జీవన ప్రమాణాలకు స్వయం ఉపాధికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు.

==============================

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనసభ్యులకు ఈనెల 18, 19, 20 తేదీల్లో క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను పునరుద్ధరించడం పట్ల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేసారు. క్రికెట్, వాలీబాల్,

బ్యాడ్మింటన్ వంటి పోటీలతో పాటు మహిళా శాసనసభ్యులకు బ్యాడ్మింటన్, త్రో బాల్, టెన్నీ కాయిట్, టగ్ ఆఫ్ వార్ మొదలగు  పోటీలను నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పాటలు, నాటకాలు, నృత్య పోటీలలో అందరూ ఉత్సాహంగా పాల్గొనాలని మంత్రి కోరారు. 20వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

==============================

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని జనవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఈరోజు 87 మందికి వైద్య సహాయం కింద ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన 63 లక్షల రూపాయల చెక్కులను లబ్దిదారులకు మంత్రి పంపిణీ చేశారు. పేదల ఆరోగ్యానికి  ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ...

(వాయిస్ 31 సెకన్లు)

==============================

ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్  కార్యక్రమానికి ఈనెల 21వ తేదీలోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని  పశ్చిమగోదావరి జిల్లా  కార్మికశాఖ అధికారి డాక్టర్ ఆకన లక్ష్మి కోరారు. భీమవరంలో కార్మిక శాఖ అధికారులతో ఈరోజు ఆమె మాట్లాడుతూ... నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం పి.ఎం.ఇంటర్న్ షిప్ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడం జరుగుతుందన్నారు. అగ్రశ్రేణి కంపెనీల్లో ఈ పథకం ద్వారా యువతకు  ఇంటర్న్ షిప్ అవకాశాలు కలగనున్నాయన్నారు. ఈ నెల 12వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఆఖరి గడువని ఆమె తెలిపారు.

==============================

ఈశాన్య భూమధ్య రేఖ హిందూ మహాసముద్రంలో ఆవరించి ఉన్న నిన్నటి ఉపరితల ఆవర్తనం ఈరోజు నైరుతి బంగాళాఖాతంలో సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించింది. దీంతో కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో  రేపు పొడి వాతావరణం ఏర్పడే  అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్ట ఉష్ణోగ్రతలలో గణనీయమైన మార్పు లేవీ ఉండకపోవచ్చని స్పష్టం చేసింది.

==============================
==============================